# సామ్రాట్ అశోక్

అదొక చిన్న రైల్వేస్టేషను, ఆ రైల్వే స్టేషనుకు ప్రత్యేకంగా ప్లాటుఫారం కూడాలేదు. అయితే అక్కడక్కడా అరడజను కానుగ చెట్లున్నాయి. ప్రతి కానుగ చెట్టుకింద ఒక సిమెంటు బెంచీ ఉంది. ఆ బెంచీలలో సగం శిథిలావస్థలో ఉన్నాయి. ఆ స్టేషన్‌పేరు గల గ్రామం అక్కడికి మైలు దూరంలో ఉంది. ఆ గ్రామాన్ని కలుపుతూ స్టేషను నుంచి పడమటి దిక్కుకు సన్నని మట్టి రోడ్డు ఉంది. ఆ రైల్వేస్టేషనులో పాసెంజరు రైళ్లు మాత్రమే ఆగుతాయి.

సమయం మధ్యాహ్నం పన్నెండు గంటలు. ఎండ నిప్పులు చెరుగుతోంది. దూరంగా కానుగచెట్టుకింద శిథిలావస్థలో ఉన్న ఓ సిమెంటుబెంచీ మీద బాగా మాసినలిగి శిథిలావస్థలో ఉన్న పాంటు, షర్టు ధరించిన ఓ మానవాకారం పడుకొని ఉంది. కానుగచెట్టు మీద కాకులు విశ్రాంతి తీసుకొంటూ కావు కావుమని అరుస్తున్నాయి. రైల్వేస్టేషను గదిలో కూర్చొని ఉన్న స్టేషను మాస్టరు, గుమ్మంలో కూర్చొని ఉన్న పోర్టరు, వాళ్ళ జీతభత్యాల పెరుగుదలల గురించి మాట్లాడుకొంటున్నారు.

బెంచి మీద పడుకొన్న మానవాకారం 'అమ్మా' అంటూ బలహీనంగా మూలిగి అటు తిరిగింది. ఆ మూలుగుకు కాకులు ఒక్కసారి పైకెగిరి మళ్ళీ కొమ్మమీద వాలాయి. ఆ మానవాకారం పేరు అశోక్. అతని ఇంటిపేరు సామ్రాట్. అయితే అతడు అశోక చక్రవర్తి వంశానికి చెందినవాడు కాదు. కాని ఒక పోలిక ఉంది. అతను విశాలమైన దేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా పరిపాలించిన చక్రవర్తి అయితే, ఇతను కాశీ నుంచి కన్యాకుమారి వరకు గత పదేళ్ళుగా ప్రతి ఇంటర్వ్యూకు హాజరయి నిరుద్యోగి చక్రవర్తిగా పేరు తెచ్చుకొన్నాడు.

కొద్ది సేపటికి నిరుద్యోగ చక్రవర్తి కళ్ళు తెరిచాడు. సరిగ్గా చెట్టుమీద కూర్చొనిఉన్న కాకుల్లో ఒకటి అత్యంత నిర్లక్ష్యంగా రెట్టవేసింది. అది సరిగా అతని నుదుటిమీద పడింది. ఒకప్పటి యూనివర్సిటీ గోల్డు మెడలిస్టు. అశోక్ దాన్ని తుడుచుకోలేదు. చెట్టుమీద తెగబలిసి పొగరు బట్టి కూర్చొని ఉన్న కాకులను తరమనూ లేదు. వాటిని అభినందన పూర్వకంగా చూసాడు. తమను దూరంగా తరిమి కొడతాడేమోనని కిందికి చూస్తున్న కాకులు అతనా ప్రయత్నం ఇసుమంతయినా చేయక పోయేసరికి తృప్తిగా గాలి పీల్చుకొన్నాయి.

నిరుద్యోగి సామ్రాట్ అశోక్ వాటి ఉత్తమ జన్మగురించి ఆలోచిస్తున్నాడు. వాటిది ఎంత స్వతంత్ర జీవనం. పిల్లగా ఉన్నప్పుడు ఏ కొద్ది రోజులో తల్లి ఆహారం అందిస్తుంది. తరువాత దానిది స్వతంత్ర జీవనం. విద్యాభ్యాసం లేదు. నిరుద్యోగంలేదు. ఆర్థిక బాధలేదు.

స్వేచ్ఛగా హాయిగా దొరికింది తింటూ, తిరుగుతూ నిద్రపోయే జీవితం. ఇలా ఎన్ని అడ్వాంటేజెస్. డిజడ్వాంటేజెస్ అనే విషయానికొస్తే వాటికేమీ లేవని చెప్పాలి. స్వజాతి శత్రువులో లేక మానవులో వాటిని అతి తేలిగ్గా చంపుతారనే సందేహం కలగవచ్చు. అలాంటప్పుడు మానవ ప్రపంచంలో రోజుకు ఎన్ని హత్యలు చట్టం కన్నుగప్పి జరగడంలేదు. పశుపక్ష్యాదులు జంతువులకంటే మానవుడు మేధోపజీవి అంటారు కాని ఏం లాభం. మానవుడు ఆ మేధస్సుతో స్వార్థం రంగరించుకొని మొత్తం ప్రపంచాన్ని భస్మీపటలం చేయాలని చూస్తున్నాడు. అలాంటప్పుడు పశుపక్ష్యాదుల జీవితం ఎంతహాయి.

అశోక్ మెల్లగా లేచి కూర్చొన్నాడు. కాకులు కొద్దిగా బెదిరాయి. లేచి నిలబడి ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూ నడుస్తున్నాడు. మనిషి తూలుతున్నాడు. ముఖం మీద పడి ఎండిపోయిన రెట్ట కడుక్కునేందుకు అతను పోవడంలేదు. రెండు రోజుల్నుంచి కాలేకడుపును చల్లార్చు కొనేందుకు కొన్ని గ్లాసులు నీళ్ళు తాగాలని రైల్వేస్టేషను వైపు నడుస్తున్నాడు. సుఖ దుఃఖల్లా చెట్ల నీడను, ఎండను భరిస్తూ స్టేషన్ను సమీపించాడు. స్టేషను ముందు వరండాలో కుండలో నీళ్ళు, పక్కనే గ్లాసు ఉంది.

గ్లాసు నిండుగా నీళ్ళు ముంచుకుని తాగబోయేసరికి లోపల్నుంచి వచ్చిన పోర్టరు "రేయ్ గ్లాసు ఎత్తుకొని తాగు" అంటూ అరిచాడు. ముందే చూసుంటే గ్లాసును అసలు తాకనిచ్చేవాడు కాదేమో. అశోక్ అతని వైపు ఉదాసీనంగా చూసి గ్లాసు ఎత్తి గడ గడ నీళ్ళన్నీ తాగేసాడు. ఒక గ్లాసు కాదు వరుసగా పదిగ్లాసులు తాగేశాడు.

"ఒరేయ్ కుండలో నీళ్ళు సగంపైగా తాగేసావురా" అన్నాడు పోర్టరు, గ్లాసు పెరుక్కొని.

అశోక్ అదేమీ పట్టంచుకోకుండా నేరుగా స్టేషను మాస్టరు గదిగుమ్మం వద్ద నిలబడి "సర్ ఈజ్ ది సెవెన్టీ సెవన్ విజయవాడ పాసెంజరు రైట్ టైమ్" అన్నాడు. అది విన్న పోర్టర్ ఖంగుతిన్నాడు.

స్టేషను మాస్టరు అశోక్‌ను పై నుంచి కిందిదాకా చూసాడు. కారడవిలా పెరిగిన జుట్టు, దుబ్బుగా పెరిగిన గడ్డం, మోకాళ్ళ వద్ద చిల్లులుబడ్డ పాంటు. మాసిన షర్టు, సంకలో జోలెలాంటి సంచి, ఎండిలోతుకు పోయిన కళ్ళు, స్టేషను మాస్టరు దృష్టిలో అతనో బెగ్గర్‌లా కనిపించాడు. రైళ్ళల్లో వాడుకగా అడుక్కునే బిచ్చగాళ్ళు కొన్ని ఇంగ్లీషు మాటలు మాట్లాడడం అతనికి తెలుసు.

వీడు టికెట్ లేకుండా ఉండి కూడా స్టేషను మాస్టరయిన తననే ఇలా అడిగాడంటే ఖచ్చితంగా పిచ్చివాడయి ఉండాలి. ఎందుకులే వీడితో గొడవ అనుకొన్నాడు.

అందుకే "యస్ మిస్టర్" అని లోపలికి వెళ్ళి పోయాడు.

అశోక్ చిన్న తనం నుంచి బ్రిలియంట్ స్టూడెంటు. ఫస్టు మార్కులతో ప్రతి క్లాసూ పాసయ్యేవాడు. అతనికి ఏటా స్కాలర్ షిప్పులు వచ్చేవి. దాంతో అతను ఎమ్.ఎ. వరకు నిరాటంకంగా చదివాడు. అతని అదృష్ట చక్రం వెనక్కు తిరగడం మొదలు పెట్టింది. అతని తండ్రి అకస్మాత్తుగా చనిపోయాడు. పి.హెచ్.డి. చెయ్యాలనుకొన్న అతని ఆశ నిరాశ అయ్యింది. బీదరికంలో మగ్గుతున్న కుటుంబాన్ని ఆదుకోవాల్సిన భారం అతని నెత్తిమీద పడింది. దాంతో ఉద్యోగాల వేటలో పడ్డాడు.

కనబడ్డ ప్రతి పోస్టుకు అప్లయి చేశాడు. ఢిల్లీలో ఆఫీసరురాంక్ సెంట్రల్ ఉద్యోగాలనుంచి తన ఊరు మునిసిపాలిటీ గుమస్తాల ఉద్యోగాల వరకు అప్లయ్ చేసాడు. ఏదీ రాలేదు. రోజులు గడిచేకొలదీ ఇంట్లోని వస్తువులన్నీ ఒక్కొక్కటే అమ్మకానికి పోసాగాయి.

ఇలాంటి పరిస్థితులలో ఉదర పోషణార్థమై కొంతకాలం రాత్రుళ్ళు, రిక్షాలు కూడా తొక్కాడు. అతను ఏమ్.ఎ. చదివాడని ఎవరి ద్వారా తెలిసిందో ఏమో, రిక్షా ఓనరు అతనికి రిక్షా ఇవ్వను పొమ్మన్నాడు. దాంతో మళ్ళీ వీధిన పడ్డాడు. తరువాత కొన్ని బట్టలకొట్లలో సేల్సుమాన్‌గా చేరాడు. అక్కడ వ్యాపారంలో జరిగే నిలువుదోపిడీ చూసి వాళ్ళని ఎదిరించాడు. దాంతో అక్కడ్నుంచి బయటకు నెట్టివేయబడ్డాడు. ఇలా రకరకాల ఉద్యోగాలు ప్రైవేటు వ్యక్తుల వద్ద సంస్థల్లోనూ చేసాడు. అన్నీ రెండువందల రూపాయల మించని ఉద్యోగాలే. ఎక్కడా ఇతను కొన్ని నెలలకంటే ఎక్కువ నిలబడలేదు.

ఇలా గత పదేళ్ళుగా రోజులు నెట్టుకొస్తున్నాడు. ఈ సంవత్సరం నవంబరు నెలాఖరు తర్వాత తను ఉద్యోగానికి వయసు దృష్ట్యా అర్హుడుకాదు. వారం క్రితం తనింటికొచ్చిన దూరపు బంధువొకాయన తమ పరిస్థితికి జాలిచెంది ఒక రాజకీయ ప్రముఖుడ్ని కలుసుకోమన్నాడు. అతన్ని కలుసుకొని తన పరిస్థితి విన్నవించుకొన్నాడు. చూస్తాం అన్నాడు ఆయన. నువ్వెక్కడుంటున్నావ్ అని అడిగాడు. స్టేషన్లో అంటూ తన అడ్రసు చెప్పాడు. జాలిగా చూశాడు రాజకీయ ప్రముఖుడు. అప్పట్నుంచి రెండు రోజులుగా రైల్వేస్టేషన్‌లో ప్లాటుఫారం మీద అతని నివాసం. కుండలోని నీళ్ళే అతని ఆహారం.

రైల్వే పోర్టరు తన కిచ్చిన ట్రీట్‌మెంట్‌కు బాధగాను, విషాదంగాను నవ్వుకొన్నాడు అశోక్. తన క్లాసు మేట్లలో చాలా మంది ఆఫీసర్లుగా, లెక్చరర్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు. కొంతమంది విదేశాల్లో కూడా స్థిరపడి ఉన్నారు.

వాళ్ళు ఇప్పటికీ తనను ఎంతో ఆదరంగా ఆప్యాయంగా పిలుస్తారు. తను మర్యాద ఇవ్వబోతే ఒప్పుకోరు. తను ఇప్పటికీ వాళ్ళను "ఒరేసుందరం, ఒరే శ్యామ్" అంటూ

సంబోధిస్తాడు. వాళ్ళు ఉద్యోగమిప్పిస్తాం తమతో రమ్మన్నారు. తను పోలేదు. తనలాంటి నిరుద్యోగులు భారతదేశంలో లక్షలమంది ఉన్నారని, వాళ్ళందరకూ ఉద్యోగం ఇప్పిస్తారా అని తను అడిగాడు. దాంతో వాళ్ళు పిచ్చివాడ్ని చూసినట్లు చూచి వెళ్ళిపోయారు.

ఇక విదేశాల్లో ఉన్న తన మిత్రులకొకే ఒక సలహా ఇచ్చాడు. 'ఒరే, మీరు విదేశాల్లో స్థిరపడిపోయారు. కష్టపడి బాగా సంపాదించండి. కాని ఆ కష్టపడ్డ సంపాదనతో మీ మాతృభూమి అయిన భారతదేశంలో ఫ్యాక్టరీలు నిర్మించండి. దేశంలోని బీదరికాన్ని, నిరుద్యోగాన్ని పారదోలండి. బీదరికపు దేశమనిపించుకొన్న ఇండియాని రిచ్‌కంట్రీ అనిపించండి. ఎక్కడున్నా ఆ గొప్పతనం మీకే చెందుతుందిగదా' అనేవాడు.

"నీ ఐడియా బాగానే ఉంది. మిగతా మన ఇండియన్స్‌తో అలోచించి చూస్తాం" అని చెప్పి వెళ్ళారు.

వాళ్ళు ఎంత వరకు ఈకార్యాన్ని నిర్వహిస్తారో అని వాళ్ళ ప్రణాళిక కొరకు ఒక వైపు ఎదురుచూస్తున్నాడు అశోక్. ఈ రెండు రోజులుగా రాజకీయ ప్రముఖుడి తీర్మానం కోసం ఎదురుచూసిన అశోక్ అకలిబాధ తాళలేక ఇక ఆరోజు ఇంటికి వెళ్ళాలని నిర్ణయించుకొన్నాడు.

ఆకలి మంటకు అతని కడుపులోని చన్నీళ్ళు బాయిలవుతున్నాయి. ఆలోచనల సుడులకు మెదడు మొద్దుబారిపోతూ ఉంది. ఈ రెండు సంఘర్షణలకు తట్టుకొంటూ అశోక్ గంటసేపు కళ్ళు మూసుకొని పడుకొన్నాడు. కాని అతనికి నిద్రరాలేదు.

తనకు కొద్ది దూరంలో బెంచీమీద కూర్చుని సంభాషణ సాగిస్తున్న ఇద్దరమ్మాయిల గొంతుకలు విని తను గడిపిన కాలేజి. యూనివర్శిటీ రోజులు గుర్తుకొచ్చాయి. అతనికొకింత సంతోషమేర్పడింది.

వాళ్ళిద్దరి సంభాషణల మూలంగా వాళ్లు తిరుపతి వెంకటేశ్వర యూనివర్శిటీలో మొదటి సంవత్సరం ఎమ్మెస్సీ చదువు తున్నారని. వాళ్ళు హాస్టలు విద్యార్థినులని గ్రహించాడు. వాళ్ళ సంభాషణ యూనివర్శిటీ రంగుల ప్రపంచం చూట్టూ గమ్మత్తుగా విహరించింది. తరువాత సినిమాలు సాహిత్యం మీదకి వెళ్ళింది. ఆమె హ్యాండ్ బాగ్ జిప్ లాగిన శబ్దం. తరువాత అందులోంచి పుస్తకాలు బయటకు తీసినట్లుంది. ఒక్కో నవల పేరు చెబుతోంది తోటి స్నేహితురాలితో.

మళ్ళీ జిప్ మూసిన శబ్దం. ఇంతలో ట్రెయిన్ గంట మ్రోగింది. కొంతసేపటికి దూరం నుంచి అరుస్తూ ఎలక్ట్రికల్ ట్రెయిన్ వస్తోంది. అది విజయవాడ వైపు వెళ్ళే ట్రెయిన్ కాదు. తిరుపతి వైపువెళ్ళేది.

కొద్ది సేపట్లో అరుస్తూ తిరుపతి వైపు వెళ్ళే ట్రెయిన్ వచ్చి స్టేషన్లో ఆగింది. అశోక్ లేచాడు. బెంచీమీద కూర్చొన్న అమ్మాయి లిద్దరూ హడావుడిగా భుజాలకు బేగ్స్ తగిలించుకొని కంపార్టుమెంటులో ఎక్కారు. ఆ స్టేషనులో ఇక అంతకంటే ఎక్కేవాళ్లు లేనందున పోర్టరు బెల్లు కొట్టాడు. రైలు పెద్దగా అరిచింది.

అటు చూస్తున్న అశోక్ ఉలిక్కిపడ్డాడు. ఇంతకు ముందు అమ్మాయిలు కూర్చొన్నచోట కింద నల్లగా మెరుస్తూ పర్సు కనపడింది. అతనికి కడుపులోని ఆకలి ఏదో హెచ్చరించింది. రైలు వెళ్ళిం తరువాత దాన్ని తీసుకోదలచుకొన్నాడు. కాని ఆ అలోచన ఒక్క క్షణం మాత్రమే. అతనిలోని మానవత్వం వెన్నుతట్టి కసిరింది. మెల్లగా అడుగులువేసి దాన్నందుకొని జిప్ లాగి చూసాడు. అతని కళ్ళు జిగేల్ మన్నాయి. అందులో మూడు వందరూపాయల నోట్లు, మూడు పదిరూపాయల నోట్లు, ఒక అయిదు రూపాయలనోటు, తిరుపతికి రెండు టిక్కెట్లు ఉన్నాయి. ఇవి లేకపోతే వాళ్ళు పడే అవస్థ తలచుకొని అతని మనసు బాధతో మూలిగింది.

అటు చూసాడు. అప్పుడే రైలు కదిలింది. వడివడిగా అడుగులువేసి రెండు మూడు కంపార్టుమెంటులను కలయజూసాడు. వాళ్ళెక్కడ లోపల కూర్చొన్నారో క్రింద ఉన్న అతనికి కనిపించడం లేదు. బండి కదిలింది. అటూ, ఇటూ పరుగెత్తుతూ నీరసంగా పిల్చాడు...

"లక్ష్మి... లక్ష్మి..." అంటూ. వాళ్ళ సంభాషణ ద్వారా వాళ్ళ పేర్లు విని ఉన్నాడు.

ఇంతలో కిటికీలోంచి ఒక అమ్మాయి తొంగి చూసి "ఇక్కడ... ఇక్కడ..." అంటూ అరిచింది.

"ఆ పిచ్చోడే పర్సు తెస్తున్నాడు" అంది తోటి స్నేహితురాలితో లక్ష్మి.

పరుగెత్తుకెళ్ళి ఆమెకు అందించాడు.

"థాంక్స్!" అంది లక్ష్మి.

"నో మెన్షన్..." అతని నోట్లోంచి ఆటోమాటిక్‌గా వెలువడ్డాయా మాటలు. ఆమె ఏదైనా ఇస్తుందనుకొన్నాడతను. ఇంతకు ముందు తను చేసిన చిన్న చిన్న సహాయాలకు ఎవరైనా ఆఫర్ చేస్తే తీసుకోలేదు. కాని ఈసారి లక్ష్మి ఏదైనా ఆఫర్ చేస్తే తీసుకోదలచుకొన్నాడు. కాని ఆమె ఈ నవ నాగరిక ప్రపంచంలో ఆయాచితంగా అభించేపదం 'థాంక్స్'ని వాడింది. సున్నాలా బ్లాంక్‌గా ఉన్న తన కడుపు ఆ థాంక్స్‌ను జీర్ణం చేసుకోలేకుండా ఉంది.

రైలు కనుచూపుమేర దాటి వెళ్ళి పోయింది. కాలే కడుపుపై చన్నీళ్ళు చిలకరించడానికి అతను అక్కడ్నుంచి నడుస్తున్నాడు. పోర్టరు ఏడ్చినా సరే కుండలోని నీళ్ళన్నీ తాగాలనేది అతని దృఢసంకల్పం. ఈ సంకల్పబలంతో తూగుతూ నడుస్తున్న అతను పట్టాను తట్టుకొని బోర్లా పడిపోయాడు. మోకాళ్ళు కొట్టుకుపోయాయి. ముఖం కంకర రాళ్ళమీద పడి

నలిగిపోయింది. దూరం నుంచి వస్తోంది విజయవాడ వెళ్ళే పాసెంజరు. అది ఈ లైను మీదే వస్తోంది. నిరుద్యోగ భారాన్ని అప్పటి వరకూ మోసిన అతను ఇక మోయలేక కుప్పలా కూలిపోయాడు.

అశోకుడు ధర్మం నాలుగుపాదాల నడిపిన ఈ భూమ్మీదనే పడి వున్నాడు, నిరుద్యోగ చక్రవర్తి అశోక్.

రైలు స్టేషన్‌ను సమీపించింది. డ్రైవర్ అతన్నొక మనిషిగా గుర్తించి రైలు ఆపితే తప్ప అతను ఈ భూమ్మీద బతకడం దుర్లభం ✸

**(మయూరి వీక్లీ, తేది 6-11-1987)**